ప్రధాన రహదారుల్లో ఫ్లెక్సీలు నిషేధం

కమిషనర్ వెంకటరావు ఆదేశం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నగర సుందరీకరణ, ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకొని దశల వారీ కార్యాచరణలో భాగంగా నగరంలోని ముఖ్య ప్రాంతాలలో ఫ్లెక్సీలు, హోర్డింగులు బ్యానర్లను నిషేధిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు తెలిపారు. నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదేశాల మేరకు నిర్దేశించిన ప్రాంతాలను ఫ్లెక్సీ ఫ్రీ రోడ్స్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ పై శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సంబంధిత అధికారులతో కమిషనర్ చర్చించి వివరాలను వెల్లడించారు. తొలుత భానుగుడి నుంచి కలెక్టరేట్ సమీపంలోని ఇంద్రపాలెం అంబేద్కర్ విగ్రహం వరకు ఫ్లెక్సీ ఫ్రీ రోడ్‌గా ప్రకటించి ఆచరణలో అమలులోకి తీసుకొచ్చామన్నారు. ఈనెల 22వ తేదీ నుంచి నగరపాలక సంస్థ తరఫున సదరు అనుమతి లేని బ్యానర్లు, హోర్డింగ్లు, ఫ్లెక్సీలు, తొలగించి అందుకు అయ్యే ఖర్చును సంబంధిత వర్గాల నుంచి వసూలు చేస్తామని స్పష్టం చేశారు. నగర సుందరీకరణ, ట్రాఫిక్ ఒత్తిడి నియంత్రణ, భారీవర్షాలు, గాలుల సమయంలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తీసుకున్న ఈ నిర్ణయానికి సంబంధిత వర్గాలన్నీ సహకరించాలని కమిషనర్ కోరారు.

ఆటో యూనియన్‌లో విభేదాలపై కార్మికుల చర్చ

విశాలాంధ్ర - అమలాపురం : ఆంధ్ర ఆటోవాలా యూనియన్ అమలాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ యూనిట్ కమిటీ సమావేశం ఏఐటియూసి కార్యాలయం నందు నెల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగినది. ఎజెండా హైస్కూల్ యూనిట్ సభ్యులు పచ్చిమాల వెంటరమణ, మాకే మధులపై యూనియన్ కమిటీ మోపిన అంశాలు ఈ సమావేశానికి ఎఐటియుసి ఉమ్మడి తూర్పుగోదావరి అధ్యక్షులు కామ్రేడ్ కె సత్తిబాబు ముఖ్య అతిథిగా హాజరైనారు. ఆంధ్ర ఆటోవాలా యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసం శెట్టి సత్తిరాజు ప్రధానకార్యదర్శి ఊటాల వెంకటేష్, ఆర్థిక కార్యదర్శి మోకా శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు నెల్లూరి తాతాజీలు. హైస్కూల్ యూనిట్ కమిటీ సభ్యులు రాయుడు ప్రసాద్, నెల్లి వెంకటేశ్వరరావు, బొర్రా సుబ్బారావు, వాచర్ల సూరిబాబు చెల్లూరి తాతాజీ, వీరవెంకట సత్యనారాయణ, బొమ్మ పణీంద్రలు. గుర్రం బళ్ళు సెంటర్ కమిటీ సభ్యులు, మాజీ పట్టణ కమిటీ అధ్యక్షులు దొమ్మేటి రామకృష్ణలు హాజరై చర్చలో పాల్గొన్నారు. పశ్చిమాల వెంకట్రావు, మాకే మధులు తమపై ఒత్తిడి తెచ్చే విధంగా కమిటీ సభ్యులు వ్యవహరిస్తున్నారని, ఇది కేవలం ఒక సామాజిక వర్గం కార్మికులు పైన కక్ష సాధింపు చర్యలుగా ఉన్నాయి అని వీటిని నివారించడానికి జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు, ఊటాల వెంకటేష్‌లు కృషి చేయనందన నేను డిపార్ట్మెంట్ పరిధిలో పరిష్కారం లభిస్తుందని వెళ్లి కంప్లంట్ ఇచ్చినామని పేర్కొన్నారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి కామ్రేడ్ మోకా శ్రీనివాసరావు మాట్లాడుతూ బహిష్కరణ అనేది అసాంఘిక చర్యలు క్రిందకు వస్తుంది అని ఏదైనా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కమిటీ భావిస్తే ట్రేడ్ యూనియన్ పద్ధతుల్లో ఉండాలని వివరించారు. అది కాకపోయినా తాత్కాలిక కమిటీ దీర్ఘకాలం కొనసాగటం వలన ఈ పరిస్థితులు తలెత్తయని వెంటనే నిర్మాణం చేపట్టి నూతన కమిటీ వేయాలని కోరారు. ఎఐటియుసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ఆటో యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.సత్తిబాబు సాధారణ పేద వర్గానికి చెందిన ఆటో ఓనర్ కమ్ డ్రైవర్లుకు చెందిన యూనియన్ నెలల తరబడి వృత్తి నిరాకరణ లాంటి పనిష్మెంట్లు వలన కార్మికుడు తీవ్ర వొత్తిడికి లోనవుతారన్నారు. ఇకపై ఆంధ్ర ఆటో వాలా యూనియన్ జిల్లా వ్యాప్తంగా చవకబారు పనులకు స్వస్తి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎవరైనా ఇటువంటి చర్యల పాల్పడితే యూనియన్ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు : కమిషనర్

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ దుమ్ములపేట రైల్వే ట్రాక్ క్రింద స్తంభించిపోతున్న చెత్త సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని నగం పాలక సంస్థ కమిషనర్ జే.వెంకట రావు తెలిపారు. వర్షం నేపథ్యంలో శుక్రవారం ఆయన అధికారులతో కలిసి దుమ్ములపేట రైల్వే ట్రాక్ ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడి బాక్స్ కల్వర్ట్, పైపులతో ఏర్పాటు చేసిన కల్వర్టను పరిశీలించారు. ట్రాక్ క్రింది ప్రాంతంలో నిలిచిపోతున్న చెత్త కారణంగా నీరు స్తంభించి పోతున్న సమస్యపై అధికారులతో చర్చించారు. సమస్య శాశ్వత పరిష్కారం కోసం కేఎస్‌పిఎల్, ఎన్ఎఫ్‌సిఎల్, కోరమండల్ సంస్థల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కాకినాడ నగరంలో చేపట్టిన డి-సిల్టేషన్ పనుల కారణంగా వర్షం వల్ల ఎక్కడా ముంపు సమస్య ఎదురు కాలేదని కమిషనర్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కమిషనర్ వెంట ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్ ఈఈ మాధవి తదితరులు ఉన్నారు.

తీర ప్రాంత నష్టాన్ని అంచనా వేయండి



విశాలాంధ్ర - యు కొత్తపల్లి : సముద్రపు కోత వల్ల ఎంత నష్టం వాటిలిందో సమగ్ర విచారణ చేపట్టి నష్టం అంచనా వేయాలని, జిల్లా ఉపాధి అధికారి ఎం శ్రీనివాసరావు అధికారులు ఆదేశించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఉపాధి అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎంపీడీవో నారాయణరావు, తాసిల్దార్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సముద్రపు కోత కారణంగా ఎంత మేర భూమి కోల్పోయారు, మత్స్యకార గృహాలు, ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు సముద్ర గర్భంలో కలిసిపోయాయి నివేదికని తయారు చేయాలని ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నివేదికను తయారు చేసి పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 24వ తేదీన కేంద్ర ప్రభుత్వ అధికారులు ఉప్పాడ తీరాన్ని పరిశీలించి సముద్రపు కోతను నివారించేందుకు ఏ విధంగా చర్యలు తీసుకోవాలో పరిశీలించడం జరుగుతుందని తెలిపారు.

పాడి రైతులకు అవగాహనా కార్యక్రమం

విశాలాంధ్ర - పెరవలి : శుక్రవారం ముక్కామల గ్రామంలోని ఉమ్మిడి వారి పాలెం ఏటి గట్టున పాడి రైతులకు పశు వైద్య సిబ్బంది అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వలన ముంపునకు గురైన లంకలలోను, ఏటి గట్టు, పల్లపు ప్రాంతాలలో వున్న పశువులను ఒడ్డుకు తీసుకురావాలని, పశువులకు వ్యాక్సిన్ వేయించని వారు ఎవరైనా వుంటే గొంతు వాపు మరియు జబ్బ వాపు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని, పశువులకు ఏమైనా అత్యవసర పరిస్థితి వస్తే రైతులందరూ తమ పశువులకు వెంటనే చికిత్స అందించేలా ఎల్ల వేళలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో పెరవలి పశు వైద్యాధికారి డాక్టర్ చరణ్ ఫణీంద్ర, ఖండవల్లి పశువైద్యాధికారి డాక్టర్ సల్మా, ముక్కామల జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఏ ఆర్ సోమేశ్వరి రైతులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన సదస్సు



విశాలాంధ్ర - చాగల్లు: తూర్పుగోదావరి జిల్లా, చాగల్లు మండలం ఊనగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నాడు బాల్యవివాహాలపై, అక్రమ రవాణా, బాలికలపై లైంగిక దాడుల గురించి అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఐ.సి.డి.ఎస్ సూపర్వైజర్ పద్మావతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఆమె మాట్లాడుతూ బేటి బచావో- బేటి పడావో అనే నినాదంతో ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో బాల్యవివాహాలు, అక్రమ రవాణాపై మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక దృష్టి సాధించిందనీ, ముఖ్యంగా పిల్లలు ఇంట్లో ఏం చేస్తున్నారు అనే దాన్ని కూడా పిల్లల తల్లిదండ్రులు దృష్టి సారించాలని కోరారు. ఆడపిల్లల చదువు, సంరక్షణతో పాటు డయల్ 100, వన్ స్టాప్ సెంటర్ల పనితీరుపై. అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ, అంగన్ వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర - కొవ్వూరు : గోదావరికి వరద పెరుగుతున్నందున లంక గ్రామాల ప్రజలు జాగ్రత్త వహించాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొవ్వూరు మండలం మద్దూరు లంక గ్రామాన్ని ముప్పిడి వెంకటేశ్వరరావు సందర్శించారు. గోదావరి వరద ప్రవాహం పెరిగినప్పుడు మద్దూర్ లంక గ్రామంలోని లోతట్టు ప్రాంతాల పూర్తిగా మునిగిపోతున్నాయి. అధికారుల సూచనల మేరకు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం 10.5 అడుగులకు చేరడంతో మరొక మూడు అడుగులు గోదావరి వరద పెరిగితే గ్రామంలోనికి నీరు ప్రవేశించే అవకాశం ఉంది. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ కాకర్ల నారాయుడు తహసిల్దార్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి

విశాలాంధ్ర - సీతానగరం: ముంపు ప్రాంతాలలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి అన్నారు. మండలంలో శుక్రవారం ఏకైక లంక గ్రామం అయిన ములకల్లంక గ్రామంలో రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పర్యటించారు. దీనిలో భాగంగా బొబ్బిల్లంక గ్రామం నుండి మర పడవలు ద్వారా ములకల్లంక చేరుకొని అక్కడ ఉన్న గ్రామ ప్రజలతో వారి కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం అంతగంతకు పెరుగుతుండడంతో లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తూ ప్రజలకు ఏ విధమైన సమస్యలు తలెత్తకుండా ఎటువంటి ప్రాణహాని ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే బత్తుల బల రామకృష్ణ మాట్లాడుతూ వరదల సమయంలో ప్రజలకు అధికారులు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ చైత్ర వర్షిణి, బత్తుల వెంకటలక్ష్మి, తహశీల్దార్, ఎంపిడిఓ, ఏఈ శివప్రసాద్, చిట్టూరి రంగారావు, పోలిన కృష్ణ,సతీష్, పృథ్వి, జనసేన మండల కన్వీనర్ కలచర్ల విజయ్‌శంకర్, మట్టా వెంకటేశ్వరరావు, దాసరి రమేష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ ఏర్పాటుకు సహకరించాలి

కార్మిక శాఖా మంత్రి సుభాష్‌ను కలిసిన ఛాంబర్ ప్రతినిధులు

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను ది.అసోసియేషన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో సభ్యులు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో 'ఆటోనగర్' ఆవశ్యకతను తాతాజీ మంత్రికి వివరించారు. కార్మిక శాఖా మంత్రిగా కోనసీమలో ఆటోనగర్ ఏర్పాటుకి సహకరించాలని మంత్రిని కోరడంతో దానికి ఆయన సానుకూలంగా స్పందించారని తాతాజీ తెలిపారు. ఛాంబర్ కార్యదర్శి యెండూరి నాగ బాబు, కుప్పాల రామకృష్ణ, అడపా వెంకటేశ్వరరావు, తోట దేవి గణేష్, సుందరనీడి వెంకటేశ్వరరావు,యర్రా సతీష్, దొంగ రాంబాబు పాల్గొన్నారు.

మద్దూర్ లంకలో కలెక్టర్ విస్తృత పర్యటన

విశాలాంధ్ర - కొవ్వూరు: కొవ్వూరు మండలం మద్దూరులంకలో శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, వరద ఉధృతి ఎక్కువగా ఉందని, చేపల వేటకు గానీ, గోదావరి నదిలోకి కానీ వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. మద్దూరు లంక గ్రామంలో బలహీనంగా ఉన్న గట్టును పరిశీలించి, వరద నీరు గ్రామంలోకి రాకుండా అడ్డులు ఏర్పాటు చేసి, వరద నీటిని నియంత్రించాల్సి ఉందన్నారు. పై ప్రాంతంలో వర్షాలు తగ్గి గోదావరికి వరద నీరు తగ్గే వరకు మొదటి ప్రమాద హెచ్చరిక కంటే ముందు గానే పునరావాస కేంద్రానికి తరలిస్తే అందుకు ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు. పంట పొలాల్లో నీరు నిలిచి ఉంటే బయటకు పంపే ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉందన్నారు. పునరావాస కేంద్రంగా గుర్తించిన స్కూల్ భవనం వివరాలు తెలుసుకున్నారు. నూతనంగా నిర్మించడం జరిగిందనీ, పునరావాసం కోసం అనువుగా ఉంటుందనీ అధికారులు వివరించారు. కలెక్టర్ వెంట కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవత్సవ తదితరులు ఉన్నారు.

భారీ వర్షాలకు నీటి మునిగిన పంటపొలాలు

విశాలాంధ్ర - ఆలమూరు : రుతుపవనాల ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని 18 గ్రామాలలో రైతులు సాగు చేసిన వరిచేలు నీటి మునిగాయి. అయితే మండల పరిధి 18 గ్రామాలలో 9,250 ఎకరాల్లో రైతులు వరిసాగు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి లక్ష్మి లావణ్య తెలియ జేస్తూ మాట్లాడారు. నీట మునిగిన వరి చేలు ఎక్కువ రోజులు వర్షపు నీటి లో నిల్వ ఉంటే వరిమూనలు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. ఒకటి, రెండు రోజులకు రైతులు కంగారు పడాల్సిన అవసరం లేదని ఆమె వివరిం చారు. ఇదిలా ఉండగా శుక్రవారం కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇన్చార్జి బండారు శ్రీనివాసరావు, జనసేన నాయకులు, మాజీ ఎంపిటిసి నాగిరెడ్డి వెంకటేశ్వరరావు (బాస్), సర్పంచ్ సంగీత సుభాష్, జనసేన మండల అధ్యక్షుడు సూరపురెడ్డి సత్య, పార్టీ శ్రేణులతో కలసి విస్తృత పర్యటనలో భాగంగా నీట మునిగిన చేలును క్షేత్రస్థాయి పరిశీలన చేశారు.



విశాలాంధ్ర - పెరవలిలో : గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండలంలో గల పలు గ్రామాల లో వరి పొలాలు పూర్తిగా నీట మునిగాయి. కానూరు ఉసులుమర్రు ప్రాంతాలలోని కొన్ని పొలాలకు వర్షం నీరు చేరి బయటకు వెళ్లే అవకాశం లేకపోవడం వలన మునకకు గురయ్యాయి. ఇంకా కొద్ది రోజులు వాతావరం ఇలాగే ఉంటే వరి పొలాలు పాడైపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



విశాలాంధ్ర-దేవరపల్లిలో : దేవరపల్లి మండలంలో గత రెండు రోజులకు కురుస్తున్న వర్షాలకు మండలంలో సుమారు 1500 ఎకరాల్లో వరినాట్లు నీటిలో మునిగినట్లు మండల వ్యవసాయాధికారి విజయ్ తెలిపారు. మండలంలో గౌరీపట్నం దుద్దుకూరు కురుకూరు త్యాజంపూడి కృష్ణం పాలెం ఎర్నగూడెం యాదవోలు బందపురం గ్రామాల్లో వరినట్లు నీటిలో మునిగిపోయాయి ముంపు ప్రాంతాల్లో వ్యవసాయ అధికారులు రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు.

రైల్వేలైన్ భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయండి

కలెక్టర్ మహేష్ కుమార్

విశాలాంధ్ర - అమలాపురం : కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ పూర్తయితే నేరుగా కాకినాడ నుండి విజయవాడ చేరుకునేందుకు ప్రత్యామ్నాయ ఎలక్ట్రిఫైడ్ రైలుమార్గం ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్ నందు రైల్వే రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ భూసేకరణ ప్రక్రియపై సమీక్షించారు. అమలాపురం-నరసాపురం రైల్వేలైన్ నిర్మాణానికి భూసేకరణ సర్వేను రైల్వే, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ రైల్వేలైన్ భూసేకరణ ప్రక్రియలో ఉత్పన్న మవుతున్న సమస్యలను జిల్లా కలెక్టర్ స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి, సంబంధిత తాసిల్దార్లను అడిగి తెలుసుకున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వర్లు, రైల్వే శాఖ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ, రైల్వే రామలింగరాజు, రెవిన్యూ డివిజనల్ అధికారి జి.కేశవర్ధనరెడ్డి, తాసిల్దార్లు, డిప్యూటీ తాసిల్దార్ చిన్నబాబు, సర్వేయర్లు పాల్గొన్నారు.

వరి పంట పొలాలను పరిశీలించిన ఏఓ

విశాలాంధ్ర - జగ్గంపేట : జగ్గంపేట మండలంలోని కాట్రావులపల్లిలోని వరి పొలాలను మండల వ్యవసాయాధికారి రెడ్ల శ్రీరామ్ పరిశీలించారు. ఎద పద్ధతిన నాట్లు వేసిన పంట పొలాలను పరిశీలించి నీరు పోయే మార్గాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. మూడు రోజుల పాటు వర్షాలు కురిసే పరిస్థితులు ఉన్నాయని నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వరి నారుమళ్ళు మునిగిపోకుండా నీరుపోయే మార్గాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అధిక వర్షాలకు నారు మడి దశలో పంట తెగుళ్ళ బారిన పడకుండా, నీరు పూర్తిగా తీసివేసి మొక్క నిలదొక్కుకున్న తరువాత లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజంతో పాటు మాంకోజెబ్ కలిపిన మిశ్రమ మందు పిచికారి చేయాలన్నారు. పంట ఊడ్చిన వెంటనే పిలక దశలో ముంపుకు గురైనట్టైతే, నీటిని పూర్తిగా బయటకు తీసివేసి తరువాత పై పాటుగా ఎకరాకు 20 కిలోల యూరియాతో పాటు 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అదనంగా వేసుకోవాలన్నారు. పొలంలో నిల్వ ఉన్న నీరు మురుగు కాలువల ద్వారా బయటకు వెళ్లేందుకు బాటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా పనిచేయాలి

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



విశాలాంధ్ర-జగ్గంపేట: ప్రజా అవసరాలకు అనుగుణంగా పని చేయకుంటే పువ్వుల పల్లకి వేసి ఇక్కడ నుండి పంపించేస్తా అంటూ అధికారులకు సున్నితంగా వార్నింగ్ ఇచ్చారు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు వారి శాఖల పనితీరు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు మీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి ఉంటే ఇన్ని సమస్యలు వచ్చేవి కావన్నారు. అధికారులు బాధ్యతగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అలా పనిచేసి మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుదామని, దానికి నేను ఏ సహకారం కావాలన్నా అందించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు నోటీసులు ఇవ్వాలని ఎంపీడీవోను నెహ్రూ ఆదేశించారు. ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జెడ్పిటిసి ఒమ్మి బిందు మాధవ, ఎంపీడీవో వసంత్ కుమార్, మండల పరిషత్ సభ్యులు, మండలంలోని సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ
మండల ప్రజా పరిషత్ కార్యాలయము, కడియం
షార్ట్ టెండర్ నోటీస్ నెం. 01/2024. తేదీ 19.07.2024.

కడియం మండల ప్రజా పరిషత్ పరిధిలో గల గ్రామ పంచాయతీలలో రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటుట కొరకు, సరఫరా చేయుటకు, సంరక్షణ కొరకు టెండర్లు కొరడమైనది.
1. మొక్కలు సరఫరా చేసి నాటుట, 2. ట్రీ గార్డ్స్ సరఫరా చేయుట
3. వాటర్ టాంకర్ ద్వారా ఒక సంవత్సరం పాటు మొక్కలు సంరక్షించుట
పై పనులకు విడివిడిగా టెండర్ లు ఆహ్వానించడమైనది.
టెండర్లు దాఖలు చేయుటకు ఆఖరి తేదీ : 27.07.2024 మధ్యాహ్నం గం.3.00 వరకు టెండర్ షెడ్యూల్ మరియు ఇతర వివరముల కొరకు కడియం మండల ప్రజా పరిషత్ కార్యాలయ పని వేళలలో సంప్రదించగలరు.

సం /- మండల పరిషత్ అభివృద్ధి అధికారి,
మండల ప్రజా పరిషత్, కడియం.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి జూమ్ కాన్ఫరెన్స్

విశాలాంధ్ర - కాకినాడ : బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను కారణంగా జిల్లా అధికారులను అప్రమత్తం చేసేందుకు శుక్రవారం ఉండవల్లి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారు, అన్ని జిల్లాల కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులతో కలిసి హాజరయ్యారు. విపత్తులు సంభవించినప్పుడు తిసుకోవలసిన చర్యలు, ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లే కుండా చూడటం, ఇబ్బందులు అధిగమించేందుకు అనుసరించాల్సిన విధానం, బలహీనంగా ఉన్న ఎటి గట్లను ముందుగానే గుర్తించడం, గండ్లను పూడ్చ దానికి ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవడం వంటి అంశాలపై జిల్లా కలెక్టర్లకు సీఎం చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో ఇన్చార్జి జిల్లా రెవెన్యూ అధికారి, డీఆర్డీఏ పీడీ కె శ్రీరమణి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, ఎమ్మెల్యేలకు ఎంపీ హరీష్ విందు

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురంలో ఎంపీ గంటిహరీష్ మాధుర్ ఇంటి వద్ద రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో సహా కోనసీమ జిల్లా ఎమ్మెల్యేలు సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యేలకు ఎంపీ హరీష్ మాధుర్ విందు ఇచ్చారు. అనంతరం జిల్లాలో సంభవించిన వరద ప్రభావిత ప్రాంతాలపై సమీక్షించారు. ఎమ్మెల్యేలు అయితా బత్తుల ఆనందరావు, దాట్ల సుబ్బరాజు. వేగుళ్ల జోగేశ్వరరావు, బండారు సత్యానందరావు, దేవ వరప్రసాద్‌లు పాల్గొన్నారు.

పంట నష్టాలను మంత్రికి వివరించిన బాబి

విశాలాంధ్ర - తాళ్లరేవు : ముమ్మిడివరం నియోజకవర్గం, కాకినాడ జిల్లా, తాళ్ళరేవు మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలు కారణంగా రైతులు పడుతున్న ఇబ్బందులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకొని వెళ్ళిన ధూళిపూడి వెంకటరమణ (బాబి), రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి, శుక్రవారం మంత్రి నివాసంలో తాళ్ళరేవు మండలంలో వరి పంటకు సంబంధించి రైతులు వేసుకున్న ఆకుమడులు, ఎద జల్లిన చేలు అన్నీ అధిక వర్షాలు కారణంగా సుమారు 500 ఎకరాలు పైబడి నారుమడులు దెబ్బతిన్నాయని, మరలా ఆకుమడులు గాని ఎదజల్లుకోవడానికి రైతులు అందరికీ విత్తనాలు ఉచితంగా ఇవ్వడానికి సహకరించాలని కోరారు. శుక్రవారం పంటపోలాలను వ్యవసాయ అధికారులు ఏడి బాబూరావు, ఎఓ తదితరులు పరిశీలించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్యే గిడ్డి

విశాలాంధ్ర - పి.గన్నవరం : ప్రజా ప్రతినిధులు, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసే ప్రజా సమస్యలను పరిష్కరించి ప్రజలకు మేలు చేసే విధంగా పనిచేయాలని పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు ఆయన పి గన్నవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అధికారులు సమావేశంలో వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణ ఆయా ప్రభుత్వ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులు చేపట్టే విషయంలో ఏ విధమైన ఇబ్బందులు ఎదురైనా ఉన్నత అధికారులు దృష్టికి తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ హుస్సేన్, ఎంపీడీవో త్రిశూలపాణి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కుండలేశ్వరం వద్ద కుంగిన ఏటిగట్టు

విశాలాంధ్ర - కాట్రేనికోన : భారీ వర్షాలకు మురమళ్ళ-పల్లంకురు ఏటిగట్టు కుండలేశ్వరం స్నాన ఘట్టం సమీపంలో మరింత బలహీనమై కుంగింది. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఏటిగట్టు బెర్మలు దిగబడ్డాయి. 100 మీటర్లకు పైగా ఏటిగట్టు బీటలు తీరి నాలుగు అడు గుల వరకు కిందకు దిగబడి ప్రమాదాన్ని హెచ్చరి స్తోంది. దీంతో ఏటిగట్టుపై ప్రయాణించే ప్రయాణికు లతో పాటు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఏటిగట్టు పునర్నిర్మాణంలో భాగంగా అప్పటి అధికారులు, కాంట్రాక్టర్ చేసిన తప్పిదాలు వల్ల గట్టు దిగబడుతుందని హెడ్ వర్క్స్ ఏఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. గతంలో కురిసిన భారీ వర్షాల వల్ల దిగబడినప్పుడు హెడ్ వర్క్స్ ఉన్నతాధికారులు కూడా ఈ ప్రాంతానికి వచ్చి గతంలో జరిగిన తప్పిదాన్ని పరిశీలించారు. అయితే ఇక్కడ ఏటిగట్టు కుంగిపోకుండా శాశ్వత రిటైనింగ్ వాల్ నిర్మించాల్సి ఉన్నా సంబంధిత అధికారులు వెదురు తడకలతో సరిపెట్టడం విడ్డూరంగా ఉంది. ఇకనైనా ఈ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ సపోర్టింగ్ వాల్ నిర్మాణం చేపట్టవలసి ఉందని, ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించడం జరిగిందని ఏఈ తెలిపారు.

కుండపోత వర్షాలతో డ్యామ్‌పై నుండి వరద నీరు

విశాలాంధ్ర - సీతానగరం : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో తూర్పు గోదావరి జిల్లాలో నే అత్యధికంగా 267.2 మిమి వర్షపాతం నమోదయింది. దీనితో ఎటు చూసినా పంట పొలాలు చెరువులను తలపిస్తూ కొండ గోదావరి ఉధృతికి మునిగిపోయాయి. ఇది ఇలాగా ఉండగా చినకొండేపూడి నుండి చీపురు పల్లి వెళ్లే రహదారిలో బంగాళా వద్ద గల డ్యామ్ వరద ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో శుక్రవారం ఉదయం పొలాలకు వెళ్లిన ముదునూరి వంశీ కృష్ణ వాగులో కొట్టుకొని పోవుచుండగా చుట్టుపక్కల రైతులు రక్షించారు. దీనితో రెవెన్యూ, పంచాయితీ అధికారులు అప్రమత్తం అయ్యా ఈ డ్యామ్ నుండి రాకపోకలు సాగించకుండా కంచెను ఏర్పాటు చేశారు. అలాగే చీపురుపల్లి నుండి నాగంపల్లి వెళ్లే రహదారిలో ఉన్న డ్యామ్‌పై నుండి కూడా వరద ఉధృతి స్థాయిలో ప్రవహిస్తుంది. ఈ తుపాను శనివారం కూడా కొనసాగుతున్నడతో జిల్లా కలెక్టర్ అన్ని పాఠశాలలకు శనివారం సెలవు ప్రకటించారు.

పల్లంట్ల, దేవరపల్లి మధ్య స్తంభించిన రాకపోకలు



విశాలాంధ్ర-దేవరపల్లి: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల వలన దేవరపల్లి పల్లంట్ల మధ్యగల పోలవరం కుడి కాలువ బ్రిడ్జి వద్ద వర్షపునీరు ఉధృతంగా రావడంతో పల్లంట్ల దేవరపల్లి మధ్య రాకపోకలు స్తంభించాయి. బ్రిడ్జి దిగువ భాగంలో ఉండటం వలన రెండు వైపులా పై నుండి వర్షపు నీరు రావడంతో బ్రిడ్జి మట్టి కొట్టుకుపోవడంతో బ్రిడ్జి ఇరువైపులా గుంటల తయారయ్యాయి. బ్రిడ్జి చివర కోతకు గురికావటంతో అధికారులు చర్యలు చేపట్టాలని దేవరపల్లి పల్లంట్ల గ్రామ ప్రజలు కోరుతున్నారు గోపాలపురం కొయ్యలగూడెం మండలాలకు చెందిన ప్రజలు పుణ్యక్షేత్రం కోట సత్తెమ్మ ఆలయానికి వెళ్లాలంటే దేవరపల్లి పల్లంట్ల గ్రామాల మీదుగా వెళ్ళవలసి వస్తుంది ముఖ్యంగా నిడదవోలు రైల్వే స్టేషన్ కూడా వెళ్లాలంటే ఈ మార్గమే శరణ్యం ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని అధికారులు స్పందించి బ్రిడ్జి కోతకు గురికాకుండా చూడాలని కోరుతున్నారు.

వరద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - వేలేరుపాడు : మండలంలోని పెద్ద వాగు ప్రాజెక్టు వరద బాధితులను స్థానిక ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శుక్రవారం పరామర్శించారు. అల్లూరి నగర్, ఒంటిమిట్ట, మేడేపల్లి, రాళ్ళపూడి, మధారం తదితర గ్రామాలకు వరద బాధితులతో మాట్లాడి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఊహించని వరద వలన తీవ్రంగా నష్టపోయామని బాధితులు ఆయన వద్ద వాపోయారు. ఎవరు అధైర్య పడవద్దని అన్ని విధాల ఆదుకుంటామని పేర్కొన్నారు. వరద సహాయ కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని, మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు నాయకులు పాల్గొన్నారు.

కిషోర్ బాలికలు రక్తహీనతకు గురికాకుండా చూడాలి

విశాలాంధ్ర- ఉంగుటూరు : కిషోర్ బాలికలలు విధిగా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత గురికాకుండా ఉంటారని అంగనవాడి ఇన్చార్జి సూపర్వైజర్ బివి శ్రీ లక్ష్మి అన్నారు. 100 రోజుల పౌష్టికాహారం ,రక్త హీనత సంరక్షణ, చట్టాలు హక్కులు కార్యక్రమంపై ఉంగుటూరు 183 అంగనవాడి కేంద్రంలో శుక్రవారం కిషోర్ బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ కిషోర్ బాలికలు ఆరోగ్యము పౌష్టికాహారాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ముఖ్యంగా చిన్నారుల్లో పౌష్టికాహారం లోపంతో ఎదుగుదల సమస్య, మహిళల్లో రక్తహీనత వంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఒకవైపు తక్కువ బరువు, బక్క పలచన దేహాలతో బాధపడుతున్న వారి సంఖ్య ఆందోళన కలిగిస్తుండగా మరోవైపు అధిక బరువు కూడా చిన్నారులను వేధిస్తున్న సమస్యగా ఉందన్నారు. పౌష్టికాహార లోపం వల్లన అన్ని రకాల అనారోగ్య సమస్యలకు ప్రధాన కారణం అన్నారు. విద్యార్థి స్థాయి నుంచే పరిసరాల పరిశుభ్రత ఆరోగ్య నియమాలు పాటిస్తూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, కిషోర్ బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

జన సైనికులకు అండగా సేనాని

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: జనసైనికులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉండేందుకు జనసేనాని పవన్ కళ్యాణ్ ఆదేశాలతో క్రియాశీల సభ్యత్వాలు చేస్తున్నామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయం వద్ద పెంటపాడు మండలం ముదునూరుకు చెందిన జనసేన క్రియాశీల సభ్యత్వం తీసుకున్న భూసారపు సతీష్‌కు రూ. 2.5 లక్షల చెక్కును బాధితుల కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో సతీష్ తన కాలు కోల్పోయాడని ఆ సమయంలో కుటుంబానికి ఈ సభ్యత్వం కొంత ఉపశమనాన్ని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, జనసేన నాయకులు పుల్లా బాబీ, పాలూరి వెంకటేశ్వరరావు ,ముదునూరు గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రజక సంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా నాగరాజు, వెంకటసుబ్బారావు

విశాలాంధ్ర - ముదినేపల్లి : ముదినేపల్లి రజకసంఘం అధ్యక్షులుగా యలకుర్తి నాగరాజు, కార్యదర్శిగా రావులపాటి వెంకట సుబ్బారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మీసాల సత్యనారాయణ, రాజమండ్రి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా నిడుమోలు హనుమంతరావు, మాడెం శ్రీను, కోశాధికారిగా మల్లంపల్లి కొండలరావులను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గం ఏర్పాటు అనంతరం ఈ తీర్మానాన్ని ముదినేపల్లి గ్రామపంచాయతీ అధికారులకు అందజేశారు.

మిషన్ శక్తి - 100 రోజులు కార్యక్రమంపై అవగాహన

విశాలాంధ్ర- పాలకోడేరు : మిషన్ శక్తి 100 రోజులు కార్యక్రమంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాలకోడేరు మండలం శృంగ వృక్షం ఉన్నత పాఠశాలలో బాలికలందరికీ సచివాలయ సిబ్బంది. మరియు అంగన్వాడి సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాలను గూర్చి, బాల్య వివాహం వల్ల జరిగే అనర్థాల గురించి, పోక్స్ చట్టం గురించి, లైంగిక వేధింపులు గురించి, అనవసరంగా బాలికలను,మహిళలను తాకే విషయం గురించి విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మహిళ పోలీస్ సత్యవాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ మధు, పాఠశాల మహిళా ఉపాధ్యాయులు తులసి, మనీ, జ్యోతి, అంగన్వాడి సిబ్బంది వెంకటలక్ష్మి, ఝాన్సీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కెఆర్ గ్రాడ్యుయేషన్ డే

విశాలాంధ్ర -భీమవరం: జాతీయస్థాయి అత్యుత్తమ విద్యాసంస్థల్లో ఒకటిగా పేరుపొందిన ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత

శిఖరాలు అధిరోహించుట అభినందించదగిన విషయమని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.వి. ప్రవీణ్ ఆదిత్య అన్నారు. ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమానికి కళాశాల అధ్యక్షులు సాగి ప్రసాదరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విదేశాల్లో కూడా ఎస్ ఆర్ కె ఆర్ అలుమిని నెలకొల్పి పలు కార్యక్రమాలు చేపట్టిన పూర్వ విద్యార్థులను ప్రశంసించారు. కళాశాల అధ్యక్షులు సాగి ప్రసాదరాజు, సెక్రెటరీ అండ్ కరెస్పాండెంట్ సాగి రామకృష్ణ, నిశాంత్ వర్మ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలలో విద్యను అందించే విధంగా నిరంతరం అధ్యాపకులకు విద్యార్థులకు నూతన టెక్నాలజీని అందించే విధంగా శిక్షణ కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల గౌరవ ఉపాధ్యక్షులు పి.కృష్ణంరాజు, ఎస్వి రంగరాజు, కళాశాల పాలకవర్గం సభ్యులు సాగి సత్య ప్రతివర్మ, డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు. తొలుత కళాశాల వ్యవస్థాపకులు సాగి రామకృష్ణంరాజు 91వ జయంతి పరిష్కరించుకొని ఆయన కాంస్య విగ్రహానికి జాయింట్ కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులకు ఆయన డిగ్రీలు అందచేశారు.

వ్యవసాయ రుణాల మంజూరుకు బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రాధాన్యత

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం : బ్యాంకు ఆఫ్ ఇండియా స్థానిక శాఖలో బ్యాంకుల జాతీయకరణ దినోత్సవం సందర్భంగా కిసాన్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. శాఖ చీఫ్ మేనేజర్ పీ ఆర్ ఎస్ బాబు ఆధ్వర్యంలో బ్యాంకు ఖాతాదారులు రైతు మహిళా ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు .బ్యాంకు రుణ విభాగం సీనియర్ మేనేజర్ స్రవంతి ,, వ్యవసాయ విభాగం(ఎస్ కె వీ కె) సీనియర్ మేనేజర్ అభిషేక్ ఝా బ్యాంకు ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి వీ సూర్యనారాయణ, సీనియర్ యూనియన్ నాయకులు ఎస్ ఎస్ ప్రసాద్ నాయకత్వంలో సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరు వ్యవసాయ సంబంధ 50 లక్షల రూపాయల రుణాలు మేనేజర్ బాబు రైతులకు అందచేశారు.మేనేజర్ బాబు మాట్లాడుతూ గూడెం శాఖలో వ్యవసాయ రుణాలు రెండువందల కోట్లని ఈ ఆర్థిక సంవత్సరంలో పది కోట్లు అదనంగా ఇచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు .వ్యవసాయ రుణాల మంజూరులో బ్యాంకు అఫ్ ఇండియా ముందుగా నిలుస్తుందని తాడేపల్లిగూడెం ప్రాంతంలో రైతులు వ్యవసాయ రుణాల కోసం, వ్యవసాయాధార రుణాల కోసం ప్రత్యేకం గా ఏర్పాటు చేసిన కృషి వికాస్ కేంద్ర విభాగాన్ని వినియోగించుకోవాలని ఎస్ కె వీ కె సీనియర్ మేనేజర్ అభిషేక్ ఝా విజ్ఞప్తి చేసారు. బ్యాంకు ఖాతాదారులు బేదపూడి వెంకటేశ్వరరావు ,కట్ట జానకి రామయ్య, వల్లేపల్లి సత్యనారాయణ, పీ వీర్ రాజు, రెడ్డి సుబ్బారావు, రెడ్డి కాశీవిశ్వనాధం, బ్యాంకు స్టాఫ్ ప్రియాంక ,సి కే వీ కే ప్రసాద్ ,బీ ఏడుకొండలు ప్రభృతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మానవత్వం చాటిన మంత్రి పార్థసారధి

విశాలాంధ్ర-నూజివీడు టౌన్: నూజివీడు మండలం దేవరగుంట గ్రామానికి చెందిన సుమారు 65 మంది కలిసి ఒక ప్రైవేటు వాహనంలో గురువారం జంగారెడ్డిగూడెం గూడెం సమీపంలో గల గుబ్బల మంగమ్మ తల్లి దర్శనానికి వెళ్లిన భక్తులు అకస్మాత్తుగా ఒక్కసారిగా వచ్చిన వరదల్లో గురువారం రాత్రి 9.30 గంటల సమయంలో చీకటి అరణ్యంలో చిక్కుకున్నారు. 65 మంది భక్తులు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని ఇక దేవుడే మనల్ని రక్షించాలని అనుకొని గుబ్బల మంగమ్మ తల్లికి మొక్కుకొని తల్లిని వేడుకుంటున్న సమయం. అదే గ్రామానికి చెందిన భక్తుడు వంకాయలు హరిబాబు స్పందించి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధికి సమాచారం అందించగా వెంటనే స్పందించిన మంత్రి ఆర్. టి. సి. డిపో మేనేజరు, ఇతర అధికారులతో మాట్లాడి తక్షణమే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి సురక్షిత ప్రాంతానికి తరలించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించిన వెంటనే ఆర్. టి. సి.డిపో మేనేజరు ఒక ప్రత్యేక బస్సును ఏర్పాటుచేసి భక్తులను ఆర్టీసీ సిబ్బంది వారి గమ్య స్థానాలకు చేర్చారు. ప్రాణాలతో తిరిగి వస్తామో లేదో అని అధైర్య పడే సమయంలో తమ మనవి ఆలకించి మమ్మల్ని ప్రాణాలతో ఇంటికి సురక్షితంగా చేర్చిన రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి జీవితాంతం ఋణ పడివుంటామని భక్తులు వారి కృతజ్ఞతను, ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి మంత్రిని మునుపెన్నడూ మేము చూడలేదని కలకాలం మీరే మాకు ఎమ్మెల్యేగా ఉండాలని ఆ గుబ్బల మంగమ్మ తల్లిని కోరుకుంటున్నామని వారి హర్షాన్ని, సంతోషాన్ని వ్యక్తం చేశారు.

కుష్టు వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: కుష్టు వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి హెచ్ ఆర్ ఎస్ సంతోష్ నాయుడు, డాక్టర్ పి.కిరణ్మయి అన్నారు. శుక్రవారం గణపవరం ఆరోగ్య కేంద్రం మూడో సచివాలయం వేలంపేట వద్ద సర్వే నిర్వహించారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ జరుగుతుందని ఇందులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని 28 ఆశ కార్యకర్తలు, 28 వాలంటీర్లు ఇద్దరూ ఒక టీం గా ఏర్పడి ఇంటింటా సర్వే చేస్తారని ఒక్కొక్క టీము రోజుకు 15 నుండి 20 గృహములు సందర్శించి ఇంటిలో అందరూ ఉంటే ఎల్ మార్కు వేసి అలాగే ఇంటిలో ఎవరూ లేకపోతే ఆ ఇంటిని ఎక్స్ మార్కుగా గుర్తించడం జరిగిందని అన్నారు. అందరిని పరీక్షించి స్పర్శ లేని మచ్చలు, రాగిరంగు మచ్చలు, ఒకటి లేదా ఐదు మచ్చలు ఉంటే అనుమానిత లెప్రసీగా గుర్తించి వైద్యాధికారి వద్దకు పంపుతారని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జె. విల్సన్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సిహెచ్ పద్మజ, ఎమ్ ఎల్ హెచ్ పి ఎస్, ఏఎన్ఎం ప్రేమలీల, హెల్త్ అసిస్టెంట్లు ఎ. కృష్ణ, ఎం.నల్లయ్య, ఎం ఎస్ యోహన్, శ్రీను, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తుందుర్రులో మిషన్ శక్తి

విశాలాంధ్ర -భీమవరం: భీమవరం మండలం తుందుర్రు అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం మిషన్ శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు అనర్థాలు, వరకట్నం వేధింపులు, మహిళలపై జరుగుతున్న అత్యాచారా లను నిరోధించేందుకు చేపట్టే చర్యలపై మహిళలకు అవగాహన కలిగించారు.181 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమస్యలను విన్నవించాలన్న దానిపై చర్చించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్సు జి.దీప్తి, కె.సరళ, అంగన్వాడీ, ఆశా, ఎఎన్ఎమ్ లు ఎస్.కనకదుర్గ, కాశీ అన్నపూర్ణ, ఎం.వజ్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల హెచ్ఎంలకు 'టీచింగ్ టూల్స్ శిక్షణ'

విశాలాంధ్ర - పాలకొల్లు : పాలకొల్లు బిఆర్ఎంవి మున్సిపల్ హైస్కూల్‌లో, సపోర్టింగ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్ఫర్మేషన్ ప్రాజెక్టులో భాగంగా శుక్రవారం హైస్కూల్, యు.పి స్కూల్ హెచ్ఎం లకు సిఆర్పి లకు 'టీచింగ్ టూల్స్ శిక్షణ' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా సమగ్ర శిక్షణ ఏపీసీ పి.శ్యాంసుందర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బోధన పద్ధతులు, తనిఖీ ఎలా చేయాలి? ఏ విధంగా నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలి అనే అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో మూడు సెంటర్లలో 300 మందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు గుమ్మళ్ళ వీరాస్వామి, ఆర్.ఎన్.ఎస్.వీ.జి శర్మ, మాస్టర్ ట్రైనిస్ లక్ష్మీనారాయణ, నరేష్, ఉత్తమ ఉపాధ్యాయులు జీవిఎస్వీఆర్ఎం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులోని లోతట్టు ప్రాంతాల పరిశీలన

విశాలాంధ్ర-ఏలూరు: తమ్మిలేరు వరద దృష్ట్యా ముందస్తు చర్యగా ఏలూరు అర్బన్ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలను శుక్రవారం ఏలూరు ఆర్డిఓ ఎన్ఎస్ కె.ఖాజావలి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. నగరంలోని నదీపరివాహక ప్రాంతమైన సాయినగర్, వైఎస్ఆర్ కాలనీ, ఎస్ఎంఆర్ నగర్, కొమడవోలు, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ప్రస్తుతం తమ్మిలేరులో నీటి ప్రవాహం లేదని తెలిపారు. వీరి వెంట నగరపాలక సంస్థ కమీషనరు ఎస్. వెంకటకృష్ణ, ఏలూరు తహశీల్దారు మురార్జి, ఇరిగేషన్ డిఇ ఉన్నారు.

అధ్వానంగా జాతీయ రహదారి

విశాలాంధ్ర-పాలకోడేరు : గత రెండు రోజులు నుండి కురుస్తున్న భారీ వర్షాలకు చేలే కాదు ప్రధాన రహదారులు కూడా చెరువులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా 165 నెంబర్ గల జాతీయ ప్రధాన రహదారి పిపి రోడ్డు పాలకోడేరు మండలంలో శృంగ వృక్షం, పెన్నాడ, గొరగనమూడి,విస్సాకోడేరు వరకు సుమారు పది కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఈ రోడ్డు అంతా పాడవటంతో ఇటీవల రోడ్డు మరమ్మతుల కార్యక్రమం చేపట్టినప్పటికీ దాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయకపోవడం వల్ల రోడ్డంతా గతుకుల మయంగా మారింది. ఇప్పుడు కురుస్తున్న వర్షాల వల్ల వర్షపు నీరంతా రోడ్డుపై ఉన్న గోతుల్లో చేరి చెరువులను తలపిస్తున్నాయి. రోడ్డు వెంబడి సరైన డ్రైనేజీ వ్యవస్థ కూడా లేకపోవడంతో ప్రధాన వీధుల్లో నీరంతా జాతీయ రహదారి పైకి చేరడంతో వాహనదారులు చాలా ఇబ్బంది పడుతున్నారు. జిల్లా కేంద్రమైన భీమవరానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ రహదారి ఇలా ఉంటే ఇక లోతట్టు ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో శుక్రవారం సాయంత్రం వరకు 46.5 మి.మి. వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

కాలనీలో రహదారి నిర్మాణం చేపట్టాలని ఆందోళన

విశాలాంధ్ర-మొగల్తూరు: మొగల్తూరు మండలం శేరేపాలెం గ్రామంలోని వైయస్సార్ కాలనీలో రహదారులు లేక గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయంలో గృహాలు నిర్మించుకుంటేనే కానీ రోడ్లు వేయలేమని చెప్పారని ప్రస్తుత ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించి తమ కాలనీలో రహదారులు నిర్మించాలని వారు కోరారు. రహదారులు లేకపోవడంతో వాడకపు నీరు వర్షపు నీరు నిల్వ ఉండి విపరీతంగా దోమల పెరిగిపోయి అనారోగ్యాలు పాలవుతున్నామని అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి కాలనీలో రహదారులు ఏర్పాటు చేయాలని వారు కోరారు. స్థానిక గ్రామ సర్పంచ్‌కు పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం లేదని వారు వాపోయారు.

వరి నారుమడులు పరిశీలించిన వ్యవసాయాకారి

విశాలాంధ్ర -మొగల్తూరు : మొగల్తూరు మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నారుమడులు నీటి మునిగిపోవడంతో శుక్రవారం మండల వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రహీం ఆయా నారుమడులను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. నారుమడులు నీట మునగకుండా ఆయిల్ ఇంజన్లతో నీటిని బయటకు చూడాలని సూచించారు. ఇప్పటికే వరి నాట్లు వేసిన రైతులు తమ పొలాల్లో మునిగిన నీటిని బయటకు వెళ్లేందుకు మార్గాలను అన్వేషించి రైతులకు పలు సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మొగల్తూరు 2 విహెచ్ఏ మౌనిక తదితరులు ఉన్నారు.

నక్కల డ్రైన్ వద్ద గుర్రపు డెక్క తొలగింపు

విశాలాంధ్ర - పోడూరు: మండలంలోని శివారు గ్రామమైన వద్దిపర్రులో నక్కల డ్రైన్ వంతెన వద్ద శుక్రవారం నీటి ప్రవాహానికి అవరోధంగా నిలిచిన గుర్రపు డెక్కను స్థానిక టిడిపి నాయకులు స్వచ్ఛందంగా తొలగించారు. నక్కల డ్రైన్ లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున నీటి ప్రవాహానికి అవరోధము ఏర్పడితే చేలు గ్రామంలోని పల్లపు ప్రాంతాలు ముంపుకి గురవుతాయని అందువలన తాము వంతెన వద్ద నిలిచిపోయిన గుర్రపు డెక్కను తొలగించినట్లు తెలిపారు. మాజీ ఎంపిటిసి శీలం వాసు మాజీ సర్పంచ్ కడిమి రాంబాబు తిరుమల దుర్గారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముంపునకు గురైన పొలాల పరిశీలన

విశాలాంధ్ర-పాలకొల్లు : పాలకొల్లు మండలంలోని పాలకొల్లు మండల పరిధిలోని సగంచెరువు, ఆగర్రు, ఆగర్తిపాలెం, వెలివెల, లంకలకోడేరు, దగ్గులూరు, శివదేవుని చిక్కాల, బల్లిపాడు గ్రామాలలో అధిక వర్షం కారణంగా ముంపుకు గురైన వరి నారుమడులను, వరి పొలాలను పాలకొల్లు సహాయ వ్యవసాయ సంచాలకులు, అడ్డాల పార్వతి, పాలకొల్లు మండల వ్యవసాయ అధికారి, కె.రాజ శేఖర్ తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ముంపుకు గురైన నారు మడులు, వరి పొలాలకు చెందిన రైతులందరూ మడి లేదా పోలములో ఉన్న నీటిని బయటకు పోయే విధముగా బాటలు తీసుకుని నీరు బయటకు పోయే విధముగా చూడాలని రైతులకు సూచించారు. నారుమడిలో నీరు బయటకు తీసిన తరువాత కార్బెండిజం 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. నారుమడికి చుట్టూ బోదులు తీసుకోవాలని రైతులను కోరారు. 5 సెంట్లు నారు మడికి యూరియ 2 కేజీలు, 1 కేజీ పోటాష్ ఎరువును కలిపి నారుమడిలో వేసుకోవాలన్నారు. ఈకార్యక్రమం లో పాలకొల్లు వ్యవసాయ విస్తరణ అధికారి కె.ప్రవీణ్, గ్రామ వ్యవసాయ సహాయకులు జి.భార్గవ్, ఎంపీఈవో టి.యస్.యస్ భరత్, రైతులు మేడిది భాస్కర్, మేడిది అశోక్, మోసుగంటి చంద్ర శేఖర్, మోసుగంటి విజయ ప్రసాద్, పోలినాటి నాగేశ్వరరావు, ఇబ్బా నాగరాజు, ఇబ్బా వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులను మరింత అప్రమత్తం చేశాం

కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర - వేలేరుపాడు : భారీ వర్షాలు, వరదలు నేపద్యంలో అధికారులను మరింత అపమత్తం చేశామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. శుక్రవారం వేలేరుపాడులో జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్ తో కలిసి పర్యటించిన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పాత్రికేయులతో మాట్లాడుతూ పెద్దవాగు వరద నీరు తగ్గినప్పటికి నీటితో ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు ఆహార పొట్లాలను అందించేందుకు శుక్రవారం మధ్యాహ్నం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో తయారు చేయించడం జరిగిందన్నారు. మూడు వేల ఆహార పొట్లాలు, త్రాగునీరు ఏర్పాటు చేశామన్నారు. బాధితులను రాత్రిపూట పునరావాస కేంద్రంలోనే ఉండమని తెలియజేశామని, అక్కడే ఆహార ఏర్పాట్లు చేస్తామన్నారు. పెద్దవాగు వరద మూలంగా దెబ్బతిన్న రహదారి మరమ్మత్తులు చేయవల్సి వుందని, విద్యుత్ పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయన్నారు. తొమ్మిది నెలలు నిండిన గర్భిణీలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్చేందుకు వారికి కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు.

నిరాశ్రయులైన కుటుంబాలకు పరామర్శ

విశాలాంధ్ర-వేలేరుపాడు: భారీ వర్షాలు, వరదలు నేపథ్యంలో శుక్రవారం వేలేరుపాడు మండలంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి పర్యటించారు. పెద్దవాగు ముంపుతో నిరాశ్రయులైన అల్లూరినగర్ కుటుంబాలను పరామర్శించి పునరావాస కేంద్రాలకు రావాలని కోరారు. ముంపునీటికి గురైన ఇళ్లల్లో ఉండకుండా పునరావాస కేంద్రంలో తలదాచుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల్లో వారికి అవసరమైన ఆహారం, త్రాగునీరు, తదితర ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న రెవిన్యూ అధికారులు గ్రామ ప్రజలను పునరావాస కేంద్రాలని తీసుకువెళ్లడానికి అవసరమైన ఏర్పాట్లను చూడాలని ఆదేశించారు. ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించేలాగా చర్యలు తీసుకోవాలని అలాగే గ్రామంలో వైద్యాధికారులు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉండి ప్రజలకు తక్షణమే వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపద్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు వారి గ్రామంలోనే ఉండి ఎప్పటికప్పుడు సమాచారాన్ని పై అధికారులకు తెలియజేయాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్ వెంట రెవిన్యూ, వైద్య, తదితర శాఖల అధికారులు ఉన్నారు.

డాక్టర్ బోస్‌కు యూరోపియన్ రికార్డ్స్ బుక్ సర్టిఫికెట్

విశాలాంధ్ర -భీమవరం: హంగరీ దేశ రాజధాని బుడాపెస్ట్ కేంద్ర స్థానంగా గల యూరోపియన్ రికార్డ్స్ బుక్ సంస్థ పట్టణానికి చెందిన ప్రఖ్యాత ఇంద్రజాలికుడు, రచయిత మేజిక్ స్టార్ డాక్టర్ బోస్‌ను 'మల్టీ టాలెంటెడ్ మెజీషియన్'గా గుర్తిస్తూ సర్టిఫికెట్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా బోస్ శుక్రవారం భీమవరంలో మీడియాకు వివరాలు తెలిపారు.బోస్‌ను ఒక ప్రదర్శకుడిగా, వ్యాస కర్తగా, రచయితగా, సంపాదకుడిగా, మేజిక్ పరికరాల పరిశోధకుడిగా, వాటి నిర్మాతగా, సంస్థల వ్యవస్థాపకుడిగా, దేశ, విదేశీ అవార్డుల గ్రహీతగా 'బహుముఖ ప్రజ్ఞావంత ఇంద్రజాలికుడు'గా ఆ సంస్థ ప్రకటించింది. పట్టణానికి చెందిన డాక్టర్ బోస్ గత 53 ఏళ్లుగా తన విశేష అనుభవంతో మేజిక్ రంగానికి పలు విధాలుగా తన సేవలను అందిస్తున్నారు. తన తోటి మెజీషియన్‌లను ప్రోత్సహించుతూ, వారికి పలు రకాల సలహాలనూ, సహకారాలనూ అందిస్తున్నారు. ఆయన గతంలో కూడా వివిధ రికార్డ్ సంస్థల నుండి 12 రికార్డ్ సర్టిఫికెట్లను అందుకోవటం జరిగింది. బోస్‌ను పట్టణ ప్రముఖులు, పలువురు విద్యావేత్తలు అభినందించారు.

రహదారి క్రమబద్దీకరణ

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : కన్నాపురం రోడ్డులో ముంపునకు గురైన రహదారి ప్రాంతాన్ని రెవెన్యూ అధికారులు శుక్రవారం క్రమబద్దీకరించారు. వరద నీటితో రోడ్డుకి ఇరువైపులా నివాసిత ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో పరింపూడి పంచాయతీ పాలకవర్గంతో కలిసి రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు,సిబ్బంది వరద నీటిని క్రమబద్ధీకరించడంతో, మెయిన్ రోడ్డుపై రాకపోకలు కొనసాగాయి. అంకాల చెరువు ఆక్రమణల వలన పోలవరం రోడ్డు ముంపునకు గురవుతోందని స్థానికప్రజలు అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మణిదివ్య, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, వీఆర్వో రామ్మోహన్, జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రాంతాలకు లోతట్టు ప్రజలు

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : వర్షప్రభావం ఎక్కువగా ఉన్నందున లోతట్టు ప్రాంతంలో ఉండే ప్రజలంతా సురక్షిత ప్రాంతానికి తరలి వెళ్లాలని ఆర్ఐ మణిదీవ్య పేర్కొన్నారు. మండలంలో బోడిగూడెం గ్రామపంచాయతీ పరిధి అంకాల గూడెం గ్రామ ఎస్సీ కాలనీ శివారు కాలువ వద్దున నివసిస్తున్న ప్రజలను సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలోకి తరలించారు. నీట మునిగిన ప్రాంతాన్ని మణిదివ్య పరిశీలించి, ఎస్సీ ప్రాంత ప్రజలకు పలు సూచనలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ చిడిపి రవి, బోడిగూడెం సచివాలయ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

బాలికల సంరక్షణపై శ్రద్ధ చూపాలి

విశాలాంధ్ర-లింగపాలెం: బాలికల సంరక్షణ పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఓ మాధవి తెలిపారు. ధర్మాజీ గూడెంలో అంగన్వాడి కేంద్రాల పరిధిలో ఉన్న తల్లులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె తల్లులకు పలు సూచనలు చేశారు. బాలికల ఆరోగ్యంపై చూపే శ్రద్ధతోపాటు వారి సంరక్షణ పై జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. బాలికలపై జరుగుతున్న అమానుష దాడులను నివారించేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. బాల్య వివాహాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇటువంటివి జరిగితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బాలికలలో ఆత్మస్థైర్యం పెంచేలా అవగాహన కల్పించాలని కోరారు. మహిళల సంరక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని వీరికున్న చట్టాల ద్వారా మహిళలు లబ్ధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కుమారి, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

ఆర్.ఎం.పి లు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : జిల్లాలోని ఆర్.ఎం.పి, పిఎంపిలుగా వైద్యం చేస్తున్న వారు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని డి ఎం హెచ్ ఓ డి, మహేశ్వరరావుశుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కమిషనర్ విజయవాడ వారి ఆదేశాల ప్రకారం వీరు ప్రథమ చికిత్స, గాయాలు డ్రెస్సింగ్ చేయడం,గాయాలకు కట్లు కట్టడం మాత్రమే చేయాలని,ఇంజక్షన్లు చేయటం, ఐవి కాన్లు పెట్టి ఫ్లూయిడ్స్ ఎక్కించడం, రోగులను అడ్మిట్ చేసుకోవటం చేయరాదని ఒకవేళ ఈ కార్యాలకు తలపెడితే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని మహేశ్వర రావు తెలిపారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే ముప్పిడి

విశాలాంధ్ర - కొవ్వూరు రూరల్ : కొవ్వూరు మండలంలోని పసివేదల మద్దురులంక గ్రామాల్లోని ముంపు ప్రాంతాలను పరిశీలించిన కొవ్వూరు శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు. ఈ సందర్భంగా ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెంద అవకాశం ఉందని, ఆరోగ్యశాఖ మరియు మున్సిపల్ అధికారులకు పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు మరియు ముంపునకు కారణమైన కాలవలను గుర్రపుడెక్కను జెసిబి సహాయంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో సూరపనేని చిన్ని, బేతిన నారాయణ, జొన్నాల గడ్డ సుబ్బరాయ చౌదరి, కాకర్ల నారాయుడు తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మానికి నిలబడే వ్యక్తి ఎమ్మెల్యే నల్లమిల్లి

విశాలాంధ్ర - అనపర్తి : ధర్మానికి నిలబడే వ్యక్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అని రామ రావణ యుద్ధంలో బలవంతుడైన రావణుడిపై రాముడు యుద్ధం చేసినట్టే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కూడా యుద్ధం చేసి గెలిచారని శ్రీ దత్త పీఠాధిపతులు శ్రీ సాయి దత్త నాగానంద సరస్వతి మహారాజ్ అన్నారు. ఈనెల 17 (తొలి ఏకాదశి రోజు)న సరస్వతి మహారాజ్ తమ శిష్య బృందంతో పశ్చిమగోదావరి జిల్లా శృంగవృక్షం దత్త పీఠం నుండి స్వయంభు శ్రీ దత్త క్షేత్రం పిఠాపురం వరకు ప్రారంభించిన 18 వ పాదయాత్రలో భాగంగా శుక్రవారం అనపర్తి చేరుకోగా టిడిపి మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను) పలువురు కూటమి నేతలు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. సరస్వతీ మహారాజ్ మాట్లాడుతూ మిత్రులు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఇక్కడ ఆతిధ్యం ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఇంకా రాజకీయాల పై పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తూ అసహజ నాయకత్వాలు పక్కకు తప్పుకుని దత్తాత్రేయుని దయతో స్థిరమైన నాయకత్వం రావడం జరిగిందని అదేవిధంగా కేంద్రంలో కూడా రావడం జరిగిందని దీనికి చాలా సంతోషిస్తున్నామని అన్నారు.

పెద్దాపురం పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - కాకినాడ : పెద్దాపురం స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపిఎస్. శుక్రవారం సాయంత్రం పెద్దాపురం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ భవనమును పరిశీలించినారు. వివిధ రికార్డులను పరిశీలించి పెద్దాపురం సిఐ, ఎస్ఐలకు పలు సూచనలు చేసిన కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపిఎస్. పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ సందర్శించిన సమయంలో పెద్దాపురం ఎస్‌డిపిఓ లతాకుమారి, సీఐ రవికుమార్, ఎస్సై సురేష్, పెద్దాపురం పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

జనసేన కార్యకర్తలకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - ఆలమూరు : జనసేన పార్టీ సభ్యత్వంలో ఉన్న పార్టీ కార్యకర్తలకు ఏ కారణం చేతనైనా ప్రమాదాలు సంభవిస్తే వారికి పార్టీ ఆర్థిక సాయంతో భరోసాగా నిలుస్తుందని కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెదపళ్ల, సందిపూడి గ్రామాలకు చెందిన జనసైనికులు ప్రమాదాలకు గురైనవారికి ఆయన ప్రమాద బీమా చెక్కులను పార్టీ శ్రేణులతో కలసి శుక్రవారం అందజేశారు. జనసేనలో క్రియాశీలక సభ్యత్వం ఉన్న వారికి ఏ కారణం చేతనైనా ప్రమాదం సంభవించి మృతి చెందితే వారికి రూ.5 లక్షలు, ప్రమాదంలో గాయపడిన వారికి రూ.50,000 వరకు బీమా అందిస్తుందని ఆయన వివరించారు. ఈనెల 28 లోపు సభ్యత్వాలు పూర్తి చేసుకోవాలని ఆయన అన్నారు. ఇందులో భాగంగా పెదపళ్లలో ముగ్గురికి, సంధిపూడిలో ఒకరికి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సంగీత సుభాష్, సూరపరెడ్డి సత్య, తోట వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు తమ్మన భాస్కరరావు, పడాల అమ్మిరాజు, పెద్దిరెడ్డి పట్టాభి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జేఎన్‌టీయుకే యూనివర్శిటీ ఇన్‌ఛార్జి ఉపకులపతిగా మురళీకృష్ణ

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్సిటీ ఇన్‌ఛార్జి ఉపకులపతిగా నియమితులై బాధ్యతలు చేపట్టిన ప్రొ. కెవిఎస్‌జి. మురళీకృష్ణకి యూనివర్సిటీ అధికారులు, మాజీ ఉపకులపతులు, సిబ్బంది 19 శుక్రవారం విసి.పేషీ నందు శుభాకాంక్షలు తెలియజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కెవిఎస్‌జి. మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా శిక్షణ అందిస్తామన్నారు. జెఎన్‌టియుకె యూనివర్సిటీ ఇన్‌ఛార్జి ఉపకులపతిగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌కి, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్‌గౌర్, ఐఏఎస్‌కి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి ఛైర్మన్ ప్రొ కె.రామ్మోహన రావుకి కృతజ్ఞతలు తెలియజేశారు. జెఎన్‌టియుకె విశ్వవిద్యాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం జెఎన్‌టియుకె యూనివర్సిటీ అధికారులు, టీచింగ్ మరియు నాన్ టీచింగ్ సిబ్బంది ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కెవిఎస్‌జి. మురళీకృష్ణని పూలమాలలతో సత్కరించి అభినందించారు. అదేవిధంగా ఏపిపిఎస్‌సి మాజీ ఛైర్మన్ ప్రొ. పి.ఉదయభాస్కర్, మాజీ ఉపకులపతులు ప్రొ. ఎస్.శ్రీనివాసకుమార్, ప్రొ. జివిఆర్. ప్రసాదరాజు, ప్రొ. కె.పద్మరాజు, మాజీ రిజిస్ట్రార్‌లతో ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కెవిఎస్‌జి. మురళీకృష్ణ సమావేశమై విశ్వవిద్యాలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. జెఎన్‌టియుకె రిజిస్ట్రార్ ప్రొ.ఎల్.సుమలత, ఉన్నతాధికారులు, డైరెక్టర్‌లు, స్పెషల్ ఆఫీసర్‌లు, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, టీచింగ్ మరియ నాన్ టీచింగ్ సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పి.మ్.విశ్వకర్మ పథకం మార్గదర్శకాలపై అవగాహన

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : జిల్లా కలెక్టర్ శ్రీమతి పి. ప్రశాంతి వారి ఆదేశముల మేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని న్యాక్ కార్యాలయంలో సమన్వయ శాఖల క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బంది తో పి.మ్.విశ్వకర్మ పథకం మార్గదర్శకాలు పై అవగాహనా వర్చ్యువల్ సమావేశం నిర్వహించారు వర్చ్యువల్ శిక్షణా సమావేశంలో గ్రామ సర్పంచ్ లు, ఎమ్.పి.డి.ఒ లు, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్ లు హాజరైనారు. ప్రధాన మంత్రి విశ్వ కర్మ పథకం ద్వారా స్వయం ఉపాధి కల్పించడం తో పాటు ఆర్థికంగా చేతి కుల వృత్తులు చేసుకునే వారికి సబ్సిడీ తో కూడిన బ్యాంకు రుణాలు పై అవగాహన పెంచుకోనేందుకు ఈ సమావేశం ఉపయోగపడడం జరిగింది. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు వివరాలు తెలియచేశారు. మరింత సమాచారం కోసం సంబంధిత ఎంపిడివో, మునిసిపల్ కార్యాలయాలని సంప్రదించాలన్నారు. ముఖ్య అతిథులుగా తూర్పుగోదావరి జిల్లా జిఎం ఇండస్ట్రీస్ పి కె పి ప్రసాద్, పి డి - డి ఆర్ డి ఏ ఎన్వివిఎస్ మూర్తి, నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి ఎం.కొండలరావు, డి ఎల్ డి వో శ్రీమతి వీణా దేవి, సిఎసి ఈ- గవర్నెన్స్ అసిస్టెంట్ మేనేజర్ టి రాజేష్, ఎం ఎస్ ఎం ఈ రీజనల్ కోఆర్డినేటర్ చంద్రమౌళి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అంత్యక్రియలు అనంతరం హత్య కేసు నమోదు

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగరలో హత్య కేసు కలకలం సృష్టించింది. ప్రశాంతంగా ఉండే గ్రామంలో హత్య ఘటన అలజడి రేపింది. మృతుని మామ ఫిర్యాదుతో పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. రామచంద్రపురం డిఎస్‌పి రామకృష్ణ పర్యవేక్షణలో మండపేట రూరల్ సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు సాగుతుంది. అంగర ఎస్సై అందే పరదేశి హత్య కేసునునమోదు చేశారు. ఆయన కథనం ప్రకారం అంగరగ్రామానికి చెందిన మతిస్థిమితం లేని నున్న నరేష్(38)ఈనెల 15 రాత్రి తన ఇంటిలో మృతి చెందాడు. మృతుడు నరేష్‌కు 2013లో కొత్తపేట మండలం వాడపాలెంకు చెందిన అందురాలైన బండారు కుసుమ ప్రసన్నతో వివాహమైంది. వారికి ఒక కుమార్తె కలిగింది. మతిస్థిమితం లేకుండా తిరగడంతో భార్య కుసుమ ప్రసన్న తమ కుమార్తెను తీసుకుని భర్తకు దూరంగా వాడపాలెంలోని అమ్మవారి ఇంటిలో ఉంటుంది. 15 రాత్రినరేష్ చనిపోగా 16న అంత్యక్రియలు చేశారు. ఇంటి గదిని పరిశీలించగా అత్తమామలకు రక్తపు మరకలు కనిపించాయి. విషయాన్ని వాడపాలెంలోని పెద్దల దృష్టికి తీసుకుని వెళ్లారు. కాగా తన అల్లుడిని హత్య చేశారంటూ మామ బండారు వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై రామచంద్రపురం డిఎస్పి రామకృష్ణ, వెంటనే స్పందించారు.

వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు :కలెక్టర్

విశాలాంధ్ర - అమలాపురం : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు గోదావరి నది వరదల ఉధృతి మూలంగా ముంపు బాధితుల సహాయక చర్యలకు మండల స్థాయిలో యం త్రాంగం అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుండి 9 ముంపు మండలాల స్పెషల్ ఆఫీసర్లు డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ముందస్తు హెచ్చరికలకు ఆ సుగుణంగా సహాయక చర్యలు పై జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ధవలేశ్వరం బ్యారేజ్ వద్ద దిగువకు 3.5 లక్షల క్యూసెక్కులు వరద నీరు వదులు తున్నారని ఈ వరద ఉధృతి 7 లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం ఉందని ఆయన తెలిపారు. నాలుగు దశలలో సహాయ కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందని ఆవాసాలకు రాకపోకలు నిలిచిపోవడం, రోడ్లపైకి నీరు చేరడం, ఇంట్లోకి వరద మీరు చేరడం, పునరావస కేంద్రాలకు తరలించడం వంటి కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. మొదటగా ఎన్ని ఆవాసాలకు రాకపోకలు రహదారులు కట్టయి నిలిచిపోతాయో వివరాలు మండల వారీగా సమర్పించాలన్నారు. అలాగే ముంపు బారిన పడే అవకాశం ఉన్న జనాభా వివరాలను నివేదికలో పొందు పరచాలన్నారు. అలాగే మండల పరిధిలో ఏటిగట్లు బలహీనంగా ఉన్న వాటి వివరాలు తెలపాలన్నారు. డ్రైనేజీ పాయింట్లు ఎక్కడెక్కడ కలుస్తున్నాయో, చోకింగ్ పాయింట్స్ వివరాలు తెలపాలన్నారు. జిల్లావ్యాప్తంగా 103 టెలి కమ్యూనికేషన్ టవర్లు ఉన్నాయని వరదల సమయంలో నిరంత రాయంగా కమ్యూనికేషన్ వ్యవస్థ పని చేసేందుకు వీలుగా ఈ టవర్ల వద్ద జనరేటర్లు డీజిల్ ఆయిల్‌తో సహా ఏర్పాట్లు టెలికం అధికారుల సమన్వయంతో చేపట్టాలన్నారు. ముంపు గ్రామాలలో ప్రజలు కాచి చల్లార్చిన త్రాగునీటినే వాడాలన్న సందేశాన్ని వైద్య ఆరోగ్య శాఖ ఏఎన్ఎం ద్వారా విస్తృత ప్రచారం గావించాలన్నారు. పీహెచ్సీలు సిహెచ్సిలులో కూడా జనరేటర్లు ఏర్పాటు చేయాలని వాటిని మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. వెర్రి పాయింట్లు, బోట్లు ఆపరేషన్‌కు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఆయన ఆదేశించారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ బి కృష్ణారావు మాట్లాడుతూ కమ్యూనికేషన్ వ్యవస్థ నిరంతరాయంగా పనిచేసేలా చూడడం అత్యంత అవసరం అన్నారు. ఏటిగట్ల బల హీనతపై ప్రత్యేక దృష్టిసారించి గండ్లు పడకుండా చర్యలు బలోపేతం చేయాలన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - రాజానగరం : ప్రస్తుత కాలంలో సీజనల్ వ్యాధులు, అతిసార వ్యాధిలు సీజనల్ జ్వరాలు ప్రబలకుండా వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తూర్పు గోదావరి జిల్లా అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్.ఎన్. వసుంధర అన్నారు. మండల కేంద్ర మైన రాజానగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసుంధర ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా ఓపీ, ల్యాబ్ రికార్డులను, పలు రిజిస్టర్లు పరిశీలించారు. టీబీ రోగులకు ప్రతి నెలా సరైన క్లినికల్ పరంగా చికిత్స మందులు అందుతున్నవి, లేనిది అనే అంశంపై ఆరా తీశారు. అనంతరం స్థానిక సుబ్బారావు కాలనీలో లెప్రసీ సర్వేని స్వయంగా పర్యవేక్షించారు. రావులచెరువు గట్టు వద్ద నీటి క్లోరినేషన్ పరీక్షను పరిశీలించారు. లాగ్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెలా 10,11 తేదీల్లో లెప్రసీ డీపీఎంఆర్ కార్యకలాపాలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. గర్భిణులకు హెచ్ఐవీ పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు.అతిసార వ్యాధి, సీజనల్ జ్వరాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పి.హెచ్.సి అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గణనీయంగా పెరుగుతున్న పొగాకు ధర

విశాలాంధ్ర-దేవరపల్లి: ఉత్తరాంధ్ర తేలిక నెలలో పండించే ఎన్ ఎల్ ఎస్ పొగాకు ధర గణనీయంగా పెరుగుతూనే ఉంది వేలం ప్రారంభం నుండి ధర పెరుగుతూనే ఉంది దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో అత్యధికంగా కిలో 386 రూపాయలు రేటు పలికింది. సరాసరి ధర కిలో 366 రూపాయలు అత్యల్ప ధర కిలో 251 రేటు పలికిందని దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి జి ఎల్ కే ప్రసాద్ ఎస్ జీవో హేమ స్మిత తెలిపారు పొగాకు రేట్లు గణనీయంగా పెరగటం వలన రైతులలో ఆనందం ఎత్తమగుతుంది రేటు పెరుగుదల వలన పొగాకు భూములకు కౌలుకు రెక్కలు వస్తున్నాయి పలుకుతుంది ఇదేవిధంగా బేరం అద్దె కూడా విపరీతంగా పెరుగుతుంది ఈ సంవత్సరం జనవరి నెలలో అనుకోకుండా తుఫాను రావటం వలన పొగాకు ఉత్పత్తి కొంతమేర తగ్గింది అంతర్జాతీయ మార్కెట్లో భారతదేశ పొగాకు ముఖ్యంగా ఎన్ ఎల్ ఎస్ పొగాకుకు డిమాండ్ పెరిగింది బ్రెజిల్ లో ఉత్పత్తి తగ్గటం చైనాల పొగాకు నాణ్యత అంతంత మాత్రమే ఉండటం వలన ఎన్ ఎల్ ఎస్ పొగాకుకు రేటు పెరగటానికి ప్రధాన కారణం అయ్యింది. ఈ సంవత్సరం ఎన్ఎల్ఎస్ పొగాకు సిరులు పండిస్తోంది రైతులు ఉత్సాహంగా రాబోవు సీజన్‌కు ఉత్పత్తి పెంచటానికి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

వెయ్యి మందికి ఉపాధి కల్పించండి

విశాలాంధ్ర - జగ్గంపేట : ప్రభుత్వం నుండి అన్ని అనుమతులు నేను తీసుకువస్తా వెయ్యి మందికి ఉపాధి కల్పించేలా నియోజకవర్గంలో పరిశ్రమను ఏర్పాటు చేయాలని పెద్దాపురం లలిత ఎంటర్ ప్రైజస్ మట్టే సోదరులను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరారు. స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కాలేజీలో పెద్దాపురం లలిత ఎంటర్ప్రైజెస్ మేనేజింగ్ డైరెక్టర్స్ ఎమ్ఎస్ ప్రసాద్, ఎం శ్రీనివాస్ ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను, ప్రభుత్వంచే మంజూరైన కంప్యూటర్ ల్యాబ్‌ను జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బాలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నెహ్రూ మాట్లాడుతూ సంపాదన అందరూ సంపాదిస్తారు. ఆ సంపాదనలో వచ్చిన దాన్ని కొంత మంది మాత్రమే సేవా కార్యక్రమాలకు ఖర్చు చేస్తారని అటువంటి సేవా తత్పరత మట్టే సోదరులకే ఉందన్నారు. విద్యార్థులకు సురక్షితమైన శుద్ధి చేసిన మంచినీళ్లు అందించాలని పెద్దాపురం లలిత ఎంటర్ప్రైజెస్ అధినేతలు కాలేజీకి ఆరో ప్లాంట్ బహూకరించడం అభినందనీయమన్నారు. ఇటువంటి వాటర్ ప్లాంట్‌లను అనేక చోట్ల 12 వరకు ఇవ్వడం జరిగిందన్నారు. వాటర్ ప్లాంట్ ఇవ్వడంతో పాటు వారే నిర్వహణ చేయడం అనేది అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జడ్పిటిసి ఓమ్మి బిందు మాధవి రఘురామ్, జెడ్ రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు, టిడిపి నాయకులు ఎస్వీ ఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, బచ్చల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియా వ్యాధిపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - యానం : యానంలో శుక్రవారం మున్సిపాలిటీ కౌన్సిల్ హాల్ నందు ఏర్పాటు చేసిన "స్టాప్ డయేరియా క్యాంపెయిన్" సదస్సులో రీజనల్ అడ్మినిస్ట్రేటర్ ఆర్ మునిస్వామి, యానాం జిజిహెచ్ డాక్టర్ వెంకటేశ్వర నాయక్, మున్సిపల్ కమిషనర్ కే రామకృష్ణ, ఏఈఎం శ్రీనివాస కుమార్, మున్సిపాలిటీ సభ్యులు స్వయం సహాయక సంఘ(రాం+) సభ్యులు పాల్గొన్నారు ఈ సందర్భంగా మునిస్వామి మరి డాక్టర్ వెంకటేశ్వర నాయక్ డయేరియా వ్యాధి పై తీసుకునే జాగ్రత్తలు గురించి వివరించారు.

డ్రోన్ వినియోగంపై మహిళలకు అవగాహన

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరంలోని డిఆర్‌డిఏ జిల్లా కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలకు జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ, బైరాజు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శివశంకర వరప్రసాద్ పురుగు మందులు జల్లే డ్రోన్ల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు సబ్సిడీపై పురుగుమందులు పిచికారి చేసే డ్రోన్‌లను ప్రభుత్వం అందిస్తుందని తెలియజేశారు.

ముంపు పొలాల్లో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు

విశాలాంధ్ర - కరప : అల్పపీడనం కారణంగా కురిసిన భారీ వర్షాలకు ఆదిలోనే వరి పంటకు దెబ్బతగిలింది. రైతులకు వ్యవసాయ అధికారులు వరిని కాపాడుకునేందుకు కొన్ని రకాల సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. కరప మండల వ్యవసాయ అధికారి ఎ రాజేష్ వరి వివిద దశలలో ఉన్నందున వరి పంటను రక్షించుకునేందుకు రైతులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. విత్తనం చల్లి రెండు లేక మూడు రోజుల గడిచినట్లయితే మడులలో ఉన్న నీటిని పూర్తిగా తొలగించి ఐదు సెంట్లు నారుమడికి ఒక కేజీ యూరియా, ఒక కేజీ మ్యూరేట్ ఆఫ్ పొటాస్ చల్లుకోవాలని చెప్పారు. ఊడ్చిన మడులలో నీటినీ తొలగించి 20 కేజీలు యూరియా 20 కేజీలు మ్యూరేట్ ఆఫ్ పొటాస్ వేసుకోవాలన్నారు. ఎలా చేయడం వలన నారుమడులు నష్టం జరగకుండా కాపాడుకోవచ్చు అన్నారు. తదుపరి మొక్క కోలుకున్న తర్వాత కుళ్ళు తెగులు రాకుండా లీటర్ నీటికి ఒక గ్రాము కార్బన్డిజం కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. యదమడులలో మొలక దశలో ఉన్న విత్తనాలు ఎక్కువగా నష్టం వాటిల్లో ప్రమాదం ఉన్నందున రైతులు మరోసారి విత్తుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

మండలంలో పలు ప్రాంతాలు ముంపు

విశాలాంధ్ర - తాళ్ళపూడి : తాళ్ళపూడి మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు, రైతులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. మండలాలకి ఎగువ నుండి వస్తున్న వర్షం నీరు, కాలువలు పొంగి దిగువకు వస్తున్న నీటితో పాటు కొవ్వాడ కాలువ నిండి మండలంలోని పలు ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయి. అన్నదేవరపేటలోని జాన్ పేటలో నీరు ఇళ్లలోకి వస్తున్నాయని ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా రాగోలపల్లి నుండి తాడిపూడి వెళ్లే రహదారి, పెద్దేవం నుండి తిరుగుడు మెట్ట గ్రామానికి వెళ్లే రహదారులు నీటి తో నిండి ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. వర్షం నీరు, పొంగుతున్న కాల్వ నీటితో పంట పొలాలన్ని కనుచూపు మేరలో చెరువుల్లా మారిపోయాయి. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రుచిత మాట్లాడుతూ నాట్లు వేసిన వరి పొలాలు 281 హెక్టార్లు నీట మునిగినట్లు పేర్కొన్నారు. తాళ్ళపూడి మండల ప్రత్యేకాధికారి రాంబాబు, ఎంపీడీఓ టి.వి.బి.రమణ పలు ప్రాంతలను సందర్శించారు.

వరిచేలలో వర్షపు నీరు

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: ఎడతెరిపి లేకుండా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో, మండలంలోని కొన్ని ప్రాంతాల్లో వరిచేలు నీట మునిగినట్లు మండల తహసిల్దార్ కే.నవీన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కాల్దరి, పసలపూడి, సూర్యారావు పాలెం తదితర ప్రాంతాలలో ఆయన స్వయంగా పరిశీలించి, వివరాలు తెలిపారు. ఎర్ర కాలువ ప్రభావంతో సుమారు 750 హెక్టార్ల వరిచేలు నీట మునిగినట్లు తెలిపారు. రైతులు తమ వరి చేలలో అదనంగా ఉన్న నీటిని పంట కాలువల్లోకి మళ్లించుకోవాలన్నారు. తహసిల్దార్ వెంట ఎస్సై వి అప్పలరాజు, మండల రీ సర్వే డిటి, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు, వీఆర్వోలు నాగరాజు, పోలయ్య, శ్రీనివాసు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర - గోపాలపురంలో : అల్పపీడనం కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో 900 హెక్టార్లలో వివిధ దశల్లో ఉన్న వరి పంట నీట మునిగినట్లు జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఒక ప్రకటనలో ఆయన తెలియజేస్తూ మండలంలోని చిట్యాల గ్రామంలో 420, వెంకటాయపాలెం 210, చెరుకుమిల్లి 180, భీమోలు 40, గంగోలు 20, కరిచర్లగూడెం10, నంది గూడెం 10, మొత్తం 900 హెక్టార్లలో వరి పంట నీట మునిగినట్లు ఆయన తెలిపారు. వరి పొలాల్లో నిల్వ నీటిని బయటకు తొలగించేందుకు మడుల్లోని గట్లనుండి నీరు త్వరితగతిని బయటకు వెళ్ళేటట్లు చూడాలని రైతులకు తెలిపారు. మరొక అల్పపీడనం ఏర్పడిన కారణంగా అధికారులు సూచనలు సలహా మేరకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి బి రాజారావు రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

సర్వర్ల సమస్యతో నిలిచిన మీ సేవలు

విశాలాంధ్ర - కాట్రేనికోన : రాష్ట్రంలోని మీసేవ కేంద్రాల్లో గత కొన్ని రోజులుగా సేవలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈపీడీసీఎల్ లోని కొత్త విద్యుత్ కనెక్షన్లు, ఇతర సేవలు, పోలీస్ రెవెన్యూ సేవలు నిలిచిపోవడంతో దరఖాస్తుదారులు సచివాలయాలు, మీసేవ కేంద్రాల వద్ద ఎదురుతెన్నులు చూస్తున్నారు. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు ఆన్లైన్ చేస్తుంటే సొమ్ములు బ్యాంకు టాప్ అప్ నుండి కట్ అయి సబ్మిట్ అవడం లేదని నిర్వాహకులు ఆవేదన చెందుతున్నారు. సర్వర్లు మెఇంటెన్స్ వర్క్ చేస్తున్నారని, సర్వర్ల సమస్యతోనే మీ సేవలు నిలిచిపోయినట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ముందస్తు సమాచారం లేకుండా మీ సేవలు నిలిపివేయటంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి మీసేవ రాష్ట్ర యూనియన్ సభ్యులు రాష్ట్ర అధికారులు దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిసింది. ఈ సర్వర్లు పని చేయకపోవ దానికి ఐటీ శాఖలో సాంకేతిక సమస్య కారణంగా తెలుస్తోంది.మీ సేవలు నిలిచిపోవడంతో శుక్రవారం రాష్ట్ర ఐటీ కార్యదర్శి దృష్టికి ఏపీ ఆన్లైన్ అధికారులు తీసుకువెళ్లి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించి వెంటనే సేవలు పునరుద్ధిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఇకనైనా మీ సేవలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని సర్వత్రా ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అవసరం ఉంటే తప్ప రాకపోకలు చెయ్యద్దు

ఆర్డీవో సత్యనారాయణ

విశాలాంధ్ర - పి గన్నవరం : పి గన్నవరం మండలంలోని గంటి పెదపూడి లంక వద్ద గోదావరి వరద ఉధృతిని కొత్తపేట ఆర్డీవో సత్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంక గ్రామాల ప్రజలు గోదావరి వరద ఉధృతి రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో అవసరం ఉంటే తప్ప బయటకు వచ్చి గోదావరినదిపై పడవలపై రాకపోకలు సాగించవద్దని సూచించారు. లంక గ్రామాలలో నివాసం ఉంటున్న సుమారు 2,000 మందికి ప్రభుత్వం అండగా ఉండి వరద సహాయక చర్యలు అందిస్తుందని తెలిపారు. గంటి పెదపూడి లంక వద్ద కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశాల మేరకు ప్రజలు రాకపోకలు సాగించేందుకు 4 మర బోట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గోదావరి ఉధృతి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రాంతాలలో ఉండే విద్యార్థుల పాఠశాలలకు కూడా సెలవులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రజలు ప్రయాణాలు సాగించే గోదావరి రేవులో నిత్యం రెవిన్యూ, పోలీస్, పంచాయతీ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. పడవలపై ప్రయాణించే సమయంలో ప్రజలందరూ లైఫ్ జాకెట్లు ధరించాలని ఆర్డిఓ సూచించారు. ప్రజలకు ఏ విధమైన అసౌకర్యం కలిగిన వెంటనే అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని ఆర్డీవో తెలిపారు. పి.గన్నవరం మండల తహసిల్దార్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ ఉన్నారు.

ముంపు ప్రాంతాలు పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర - పెదపూడి : అనపర్తి మండలంలో తుఫాను కారణంగా కురిసిన అధిక వర్షాలతో ముంపుకు గురైన ప్రాంతాలను మండల ప్రత్యేక అధికారి ఎం నాగలత ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. శుక్రవారం ఎం నాగ లత, తాహసిల్దార్ సునీల్ బాబు, ఎంపీడీవో రవికుమార్ మండలంలోని దుప్పలపూడి, అనపర్తి, పొలమూరులో నింపులకు గురైన ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏవో సురేష్ కుమార్ మాట్లాడుతూ మండలంలో మండలంలో 1100 ఎకరాల వరి పొలం నీటిలో మునిగిపోవడం జరిగిందని తెలిపారు.

కాట్రేనికోనలో ఏటిగట్లు పరిశీలన

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాట్రేనికోన మండల ప్రత్యేక అధికారి బి వీరస్వామి శుక్రవారం మండలంలో భారీ వర్షాలుకు నీట మునిగిన పల్లపు ప్రాంతాలను పరిశీలించారు. అలాగే పల్లంకుర్రు శివారు బూలవారి మొండి వద్ద బలహీనంగా ఉన్న ఏటిగట్టును పరిశీలించి ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులు ఆదేశించారు. స్థానికంగా వరద పరిస్థితిని సమీక్షించారు. అలాగే పల్లంకురు నుండి కుండలేశ్వరం వరకు ఏటిగట్టును ప్రత్యేక అధికారి పరిశీలించారు. గ్రామాల్లో వర్షపు ముంపు నీరు వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా గ్రామపంచాయతీలు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. కాట్రేనికోన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

విశాలాంధ్ర - అనపర్తి : తుఫాన్ ప్రభావం వల్ల ఎటువంటి వ్యాధులు సోకకుండా ప్రతి గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు రాజమహేంద్రవరం పంచాయతీరాజ్ డివిజన్, మండల ప్రత్యేక అధికారి ఎం.నాగలత తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వాటర్ ట్యాంక్‌ల శుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పంచాయతీ ఈవోలను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, తహసిల్దార్ సునీల్ బాబు, ఈవో పి ఆర్ డి పద్మజ, ఆరోగ్యశాఖ, పంచాయతీ రాజ్ అధికారులు తదితరులు ఉన్నారు.

భక్తుల సౌకర్యార్థం 12 ఉచిత ఆటోలు ఏర్పాటు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు శనివారం రోజుకు అధిక వర్షాలు కారణంగా దేవస్థానం వారు 12 ఉచిత ఆటోలు భక్తుల సౌకర్యార్థం రాకపోకలకు ఏర్పాటు చేయడమైనది కావున తెలియపరచుకుంటున్నాము. దూర ప్రాంతంలో నుండి వచ్చు భక్తులు దేవాలయము ఆవరణలో ఉన్నటువంటి ఏటిగట్టు ప్రాంతము బురద ఎక్కువగా ఉండడం వలన వాహనముల జారీ పోవుచున్నది. కొత్త పార్కింగ్ నందు నీరు నిల్వ ఉండడం వలన మీ యొక్క వాహనములు అక్కడ నిలుపుదల చేయడానికి ఇబ్బందికరంగా ఉండును కావున దయవుంచి దూర ప్రాంతంలో వారు పార్కింగ్ వేరే ప్రదేశంలో మీరే ఏర్పాటు చేసుకొని దేవాలయమునకు యాత్రికులకు ఇబ్బంది కలుగకుండా భక్తులకు ఇబ్బంది లేకుండా సహకరించవలసిందిగా ఆలయ కార్యనిర్వాహణాధికారి భూపతి రాజు వెంకట సత్య కిషోర్ కుమార్ తెలిపారు.

నిజాయితీని చాటుకున్న పాస్టర్

విశాలాంధ్ర - జగ్గంపేట : ఎక్కడైనా వస్తువు కానీ, నగదు కానీ దొరికితే అపహరించాలని చూసే ఈ రోజుల్లో రోడ్డు మీద దొరికిన సుమారు రూ.70 వేలు విలువ చేసే నగలకు బాధితులకు అప్పగించారు. ఆశీర్వాద్ రియల్ ఎస్టేట్స్ యజమాని, పాస్టర్ కె రాజు. వివరాల్లోకి వెళితే రాజు మండలంలోని కాట్రావులపల్లి వెళ్తుండగా రోడ్డుపై పర్సు పడి ఉంది. ఆ పర్సు తీసి చూడగా అందులో నగలు ఉన్నాయి. నగలు బిల్లు ఆధారంగా ఆ షాపు యజమానికి ఫోన్ చేస్తే బిక్కవోలు గ్రామానికి చెందిన బాధితులుగా తెలిసింది. ఆ నగలను పోలిస్ స్టేషనుకు అప్పగించి జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, ఇంచార్జి ఎస్ఐ బలరాం, ఏఎస్ఐ నూకరాజుల సమక్షంలో మండల పాస్టర్స్ అధ్యక్షులు వెలిశెట్టి రాంబాబు, ఎస్ ఎలీషా రాజు, ఎన్‌విఆర్ చక్రవర్తి అధ్వర్యంలో బాధితులకు అప్పగించారు. నిజాయితీ చాటుకున్న రాజును పలువురు అభినందించారు.

వరద ముంపు పొలాలు ఆర్టికల్చర్ అధికారి పరిశీలన

విశాలాంధ్ర - సీతానగరం : వరద ముంపు పొలాలను ఆర్టికల్చర్ మండలాధికారి రీన శుక్రవారం పరిశీలించారు. మండలంలో గల మీర్తిపాడు, ఉండేశ్వరపురం గ్రామాలలో ముంపు బారిన పడిన ఉద్యవన పంటలు అయిన అరటి, కూరగాయల పంట పొలాల్లో రైతులతో కలిసి పరిశీలించి వారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు పై సూచనలు అందించారు. ఈ సందర్భంగా రీన మాట్లాడుతూ వచ్చిన వరదను సాధ్యమైనంత త్వరగా ఉరికి నీటి కాలువల ద్వారా పంట పొలాల నుండి బయటకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మేము అందించే సూచనల ప్రకారం ఎరువులు క్రిమిసంహారక మందులను వాడడం వలన అధిక నష్టం నుండి రైతులు బయటపడే అవకాశం ఉందని అన్నారు. మీకు ఏ విధమైన సందేహాలు ఉన్న మీ గ్రామంలో ఉన్న వ్యవసాయ అధికారిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి ఎచ్ ఏ ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.